ప్రజాశక్తి

శనివారం 24 జూన్ 2023 5

శ్రీ సత్యసాయి



'పది' సప్లిమెంటరీ ఫలితాల్లో

అనంత 59.95, శ్రీ సత్యసాయి 57.78 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-,అనంతపురం సిటీ

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శుక్రవారం నాడు విడుదల అయ్యాయి. పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ అమరావతిలో వీటిని విడుదల చేశారు. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి 12,349 మంది పరీక్షరాయగా 7,403 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 59.95శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం తెలిపారు. ఇక శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి 10,164 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 5,873 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 57.78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌ఛార్జి డిఇఒ రంగస్వామి తెలిపారు.



544-డి నిర్వాసితులకు న్యాయం చేయాలని రైతుసంఘం, నిర్వాసిత సంఘం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు



- అనంత జిల్లా మీదుగా 544-డి రహదారి
- రోడ్డు ఏర్పాటుకు భూసేకరణ
- పరిహారంపై స్పష్టత కరువు
- సాగు భూములకు మొక్కుబడి పరిహారం

నిర్వాసితుల్లో అయోమయం

అనంతపురం జిల్లా మీదుగా జాతీయ రహదారి 544-డి విస్తరణ పనులు మొదలయ్యాయి. పనులు ప్రారంభమైనా పరిహారం విషయంలో స్పష్టత లేక నిర్వాసితుల్లో అయేమయం నెలకొంది. టెండరు ప్రక్రియ పూర్తయి సర్వే దాదాపు పూర్తయ్యింది. ఈ రోడ్డు ఏర్పాటు వల్ల ఇళ్లు, భూములు కోల్పోనున్న నిర్వాసితుల్లో పరిహారం పరిస్థితి ఏమిటన్న ఆందోళన మొదలైంది. మార్కింగ్‌లు చేసుకుంటూ పోతున్న అధికారులు పరిహారం విషయమై పెదవి విప్పడం లేదు. ఎంత పరిహారం ఇస్తారన్న దానిపై స్పష్టనివ్వకపోవడంతో గుబులు రేగుతోంది. పాత అంచనాల ప్రకారం కాకుండా విలువ ఆధారంగా పరిహారమివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం పాత అంచనాల ప్రకారమే పరిహారం పంపిణీకి సిద్ధపడ్డారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జాతీయ రహదారి 44 నుంచి జాతీయ రహదారి 16కు అంటే అనంతపురం నుంచి విజయవాడకు రహదారి విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టింది. దీనికి 544-డి అని పేరుపెట్టారు. వాస్తవానికి ఇది 2014లోనే మంజూరైంది. అప్పట్లో ఈ ప్రక్రియ టెండరు దశ వరకూ వచ్చింది. ఈసమయంలో అనంతపురం నుంచి అమరావతికి గ్రీన్ ఫీల్డ్ అంటే పూర్తిగా కొత్త రహదారి నిర్మాణం చేపట్టే ఆలోచనతో 544-డిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. 2019లో అధికారం మారాక గ్రీన్‌ఫీల్డ్‌కు ప్రభుత్వం స్వస్తి పలికింది. కొత్తగా బెంగళూరు - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను తెరపైకి తెచ్చింది. ఇది రావడంతో తిరిగి ఇప్పుడు 544-డి మళ్లీ తెరపైకి ఇచ్చింది. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యి అనంతపురం నుంచి భోగసముద్రం వరకు 69 కిలోమీటర్ల మేర ఈ జిల్లాలో రహదారి నిర్మాణం జరగనుంది. దీనికి భూసేకరణ జరగాల్సి ఉంది.

500 హెక్టార్ల భూమి అవసరం

అంతపురం నుంచి భోగసముద్రం వరకు నిర్మిస్తున్న 544-డి నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి సుమారు 500 హెక్టార్ల భూమి అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే ఉన్న భూమి కాకుండా ఇది అదనంగా అవసరమవనుందని అధికారులు చెబుతున్నారు.

పరిహారంపై స్పష్టతనివ్వని అధికారులు

ఏడు మండలాలు, 34 గ్రామాల గుండా ఈ రహదారి వెలుతోంది. అనంతపురం నుంచి ముచ్చుకోట వరకు ఒక ప్యాకేజీ, అక్కడి నుంచి భోగసముద్రం వరకు రెండో ప్యాకేజీ కింద పనులు చేపడుతున్నారు. అవసరమైన 500 హెక్టార్ల భూమిలో 85.102 హెక్టార్ల భూమి ఇప్పటికే అందుబాటులో ఉంది. తక్కిన 414.898 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. ఈ విస్తరణలో సుమారు 600 ఇళ్లు కూడా పోనున్నాయి. వీటి పరిహారం పైనే ఇప్పుడు ఆందోళన నడుస్తోంది.

2014 అంచనాల ప్రకారమే పరిహారం

2014 అంచనాల ప్రకారమే ఇప్పుడు పరిహారం ఇచ్చే అవకాశాలున్నట్టు అధికారులు చెబుతున్నారు. 2014లో మొదటి దపా రహదారి మంజూరైన సమయంలోనే భూ సర్వే పూర్తయ్యి ఉండటంతో అప్పటి భూమి విలువ ప్రకారమే ఇప్పుడూ పరిహారం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లెక్క ప్రకారమే జాతీయ రహదారి సంస్థ రూ.156 కోట్లను మంజూరు చేసింది. అయితే ఇప్పుడు నిర్వాసితులు మాత్రం ఇప్పటి భూమి విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

జాతీయ రహదారి కింద భూములు ఇళ్లు, కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలి. భూమి కోల్పోతున్న రైతులకు సెంటుకు కనీసం రూ.50 వేలు ఇవ్వాలి. 2023 ధరల ప్రకారం ఇళ్లకు పరిహారం చెల్లించాలి. 2013 భూసేకర చట్టం ప్రకారం పరిహారమివ్వాలి దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే బాధిత రైతులు, ప్రజల పక్షాన పోరాటం సాగిస్తాం.

వి.శివారెడ్డి,
544-డి రోడ్డు నిర్వాసితుల కన్వీనర్.

ఒక్కఛాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

- వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం
- పెరిగిన హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు
- ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు
- రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం
- వచ్చే ఎన్నికల్లో వైసిపిని తరిమికొడదాం
- 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

2019 ఎన్నికల్లో అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి, గడిచిన నాలుగేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేశారని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు టిడిపి గ్యారెంటీ పేరుతో చేపట్టిన జోన్-5 ప్రచార బస్సుయాత్ర శుక్రవారం ఉదయం కదిరిలో ప్రారంభం అయ్యింది. కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సుయాత్రను ప్రారంభించారు. అనంతరం కదిరి దర్గాలో ముస్లిములతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ బస్సుయాత్ర రాయలసీమ సర్కిల్, టవర్ క్లాక్ మీదుగా కాలేజ్ సర్కిల్ చేరుకుంది. అక్కడ ఎన్టీఆర్ విగ్రహనికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి జిల్లా టిడిపి అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బికె.పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజి మంత్రి ఫారుఖ్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నం హనుమంతరాయ చౌదిరి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల శ్రీరామ్, బండారు శ్రావణి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి నాయకులు ప్రసంగించారు. రాష్ట్రంలో గత ఎన్నికలకు ముందు ఒక్క ఛాన్స్ పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారాన్ని చేపట్టారన్నారు. అధికారం చేపట్టాక ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్యే ఇందుకు నిదర్శనం అన్నారు. ఆయా నియోజకవర్గాల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ఎమ్మెల్యేలు, నాయకులు చేస్తున్న అన్యాయాలు, అక్రమాలకు అంతేలేదన్నారు. టిడిపి నేతలు అచ్చెం నాయుడు, కొల్లు రవీంద్రా, పట్టాభిరాము తదితరులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని గుర్తు చేశారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో ప్రసంగిస్తున్న బికె.పార్థసారథి

మినీమేనిఫెస్టోతో ప్రజలకు భరోసా..

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఇటీవల రాజమండ్రిలో జరిగిన మహానాడులో టిడిపి మినీమేనిఫెస్టో విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా మహిళల కోసం జిల్లాలో ఉచిత ప్రయాణ సదుపాయం, ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం, బీసీల కోసం ప్రత్యేక చట్టం, అమ్మకు వందనం కార్యక్రమం ద్వారా కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా అంతమందికి ఏడాదికి రూ.20వేల సాయం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3000 హామీలు ఇచ్చారన్నారు. దేశ చిత్రపటంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపాలంటే ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అన్నారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి వైసిపి అరాచకపాలన అంతం చేసి టిడిపిని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

కదిరికి కందికుంట... రాష్ట్రానికి చంద్రబాబు..

రాష్ట్ర భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని, కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు. కదిరి నియోజకవర్గం ప్రజలకు ఏ సమస్య వచ్చినా జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి పరిష్కరిస్తాం అని చెప్పిన ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్య కోసం గొడ్డలి కొనుగోలు చేసేందుకు కదిరిని వాడుకున్నారే తప్పా ఈ ప్రాంత ప్రజల అభివద్ది కోసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జెఎల్.మురళీధర్, నాయకులు సుధాకర్, దేవళ్ల మురళి, మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్‌బాను, కదిరి టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, ఎస్సీ నాగేంద్రప్రసాద్, తెలుగు యువత నాయకులు, గంగయ్య నాయుడు, ఎస్సీ సెల్ నాయకులు రాజశేఖర్ బాబు, పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు



స్కార్పియో వాహనంతో పట్టుబడిన యువకులు



స్కార్పియో వాహనంలో ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్‌ను చూపుతున్న యువకుడు

గంజాయి మత్తులో

యువకుల హల్‌చల్

అతివేగంతో స్కార్పియో డ్రైవింగ్ వాహనంలో ఎమ్మెల్యే స్టిక్కర్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

గంజాయి మత్తులో ఐదుగురు యువకులు ముదిగుబ్బ సమీపంలో శుక్రవారం సాయంత్రం హల్‌చల్ చేశారు. అతివేగంతో స్కార్పియో వాహనాన్ని నడిపి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. స్థానికులు 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్నం పోలీసులు వీరిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఐదుగురు యువకులు ఎపి09 సిహెచ్2373 నెంబర్‌గల వాహనంలో కదిరి నుంచి అనంతపురం వైపునకు ప్రయాణిస్తున్నారు. గంజాయి మత్తులో ఉన్న వీరు అతివేగంతో వాహనం నడుపుతున్నారు. పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలసముద్రం గ్రామం సమీపాన ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడుని ఇన్నోవాలో వెళ్తున్న యువకులు అడ్డగించారు. ద్విచక్రవాహనదారున్ని బెదిరించి అతని నుంచి ఫోన్‌పే ద్వారా రూ.18 వేలను వారి ఖాతాలోకి బలవంతంగా వేయించుకున్నారు. అక్కడి నుంచి ముదిగుబ్బ వైపు అతివేగంగా ప్రయాణించారు. ముదిగుబ్బ సమీపంలో ఒక ఆటోను వేగంగా ఢీ కొనడంతో ఆటోలో వ్యక్తికి గాయాలు అయ్యాయి. ఇలా అతివేగంతో స్కార్పియో వాహనం అనంతపురం వైపునకు వెళ్తుండగా స్థానికులు 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు కాకతీయ పాఠశాల వద్ద జెసిబిని రోడ్డుకు అడ్డుపెట్టి ఇన్నోవా వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంతో సహా అందులో ఉన్న యువకులను పట్నం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. వాహనాన్ని పరిశీలించగా అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే స్టిక్కర్ లభించింది. ఈ యువకులు అనంతపురం నగరం శారదానగర్‌కు చెందిన షేక్ ఫరీద్, నాగభాస్కర్, జి.కార్తీక్, డి.కార్తీక్‌గా తాడిపత్రికి చెందిన దిలీప్ గుర్తించారు. ఈ యువకులు ఎవరు.? ఇందులో ఎమ్మెల్యే స్టిక్కర్ ఎందుకు ఉందన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

జగనన్న సురక్షతో పారదర్శకత

సంక్షేమ పథకాల అమలు, సమస్యల పరిష్కారం - కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు, ప్రజా సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. శుక్రవారం నాడు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్‌ఒ కొండయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవానీ శంకర్‌లు ఇందులో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలుపై ప్రతి ఇంటికీ వాలంటీర్లు వెళ్లి సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని సంక్షేమ పథకాలు, ఇతర సమస్యలు ఉంటే అర్హులై ఉండి లబ్ధి పొందని వారు ఉంటే వారిని గుర్తించి వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. వారికి ఏమైనా కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారి నుంచి దరఖాస్తులు తీసుకుని సచివాలయానికి తీసుకెళ్లి టోకెన్, సర్వీసు నెంబర్లను తిరిగి వారి ఇంటి వద్దకే అందజేయాలన్నారు. ఈ క్యాంపులు ఎప్పుడు నిర్వహిస్తారో ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులకు తెలపాలన్నారు. కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు, కొత్త రేషన్ కార్డు, కార్డు విభజన, కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ఈ కార్యక్రమంలో అందించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు రేపటి నుంచే క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జులై 1 నుంచి క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, గహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, సర్వే ల్యాండ్స్ ఏడీ రామకృష్ణ, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, మార్కెటింగ్ ఏడీ మూర్తి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పట్టు పరిశ్రమ అధికారి పద్మమ్మ, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, ఎంపిపి ఎవి.రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ పాల్గొన్నారు.




వీడియో కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎస్పీ కార్యాలయం ముందు

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తన కుమారునిపై అక్రమ కేసు పెట్టి పోలీసులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయం ముందు ఓ మహిళ విషం తాగి శుక్రవారం నాడు ఆత్మహత్నాయత్నానికి పాల్పడింది. బాధితురాలు శోబాబాయి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పుట్టపర్తి మండలం గోనే నాయక్‌తండాకు చెందిన శోబాబాయి కుమారుడు ప్రదీప్‌నాయక్ హిందూపురానికి చెందిన వందనబాయి గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇది ఇష్టం లేని వందన కుటుంబీకులు పోలీసులతో ప్రదీప్‌పై అక్రమ కేసు పెట్టించారు. హిందూపురం పోలీసులు దీనిని విచారణ చేయకుండా అక్రమ కేసు బనాయించారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తన కుమారునికి న్యాయం చేయాలని కోరినా పోలీసులు స్పందించకపోవడంతో శుక్రవారం ఉదయం ఎస్పీ కార్యాలయం వద్ద శోబాబాయి క్రిమి సంహారక మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు వెంటనే అప్రమత్తమై ఆమెను చికిత్స నిమిత్తం సత్యసాయి జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం 108 సాయంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శోభబాయి



తోపుడు బండి వద్ద టిఫెన్ తింటున్న విద్యార్థులు

ఒంటిపూట బడితో విద్యార్థులకు అవస్థలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఎండల తీవ్రత తగ్గకపోవడంతో రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలను వేసవి సెలవుల తర్వత కూడా ఒంటి పూట బడిని నిర్వహిస్తోంది. ఉదయం 7:30 గంటల నుండి 11:30 గంటల వరకు పాఠశాలను నిర్వహించాలని ఆదేశించింది. ఈ బడి సమయం గ్రామీణ ప్రాంతాలలోని ప్రాథమిక పాఠశాలలు వరకు ఇబ్బంది లేకపోయినా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాత్రం ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుండి మండల/పంచాయతీ కేంద్రాలలోని పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఉదయం 6 గంటలకే ఇంటి నుండి బయలు దేరాలి. దీంతో టిపెన్ తినే అవకాశం ఉండదు. ఇక పాఠశాలకు వచ్చిన తర్వత కూడా పాఠశాల వదిలే సమయంలో 11:30 గంటలకు భోజనం పెడుతుండటంతో విద్యార్థులు ఆకలికి తట్టుకోలేక విలవిలలాడుతున్నారు. కొందరు 11:30 గంటల వరకు కడుపు మాడ్చుకొని ఉంటున్నా మరి కొంత మంది రోడ్డుపై తోపుడు బండ్ల దగ్గర, హోటళ్ల దగ్గర తమ ఆకలిని తీర్చుకుంటున్నారు. విద్యార్థుల అవస్థలు చూసిన ప్రజలు ఉదయం 8గంటలకే టిపెన్ పెట్టి తర్వాత పాఠశాల కొనసాగించవచ్చు కదా అని అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ వెంటనే పాఠ్య పుస్తకాలను ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను తెలసుకోవాడానికి శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్బంగా పట్టణంలోని నేతాజీ బాలికల ఉన్నత పాఠశాల, ఓరియంటల్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మధ్యాహ్న బోజనం పరిశీలన చేశారు. ఈ సందర్బంగా బాబావలి మాట్లాడుతు విద్యా సంవత్సరం ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్న ఇంత వరకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను అందించలేదన్నారు. దీంతో పాటు నూతనంగా చేరిన విద్యార్థులకు షూస్, నోటు పుస్తకాలు సైతం ఇవ్వలేదన్నారు. ఇలా అయితే విద్యార్థులు ఎలా చదవాలని ప్రశ్నించారు. విద్యార్థులకు అవసరమైన వాటిని వెంటనే ఇవ్వాలన్నారు. దీంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్నా నాడు-నేడు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, జస్వంత్, హర్ష, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సమస్యలను తెలుసుకుంటున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి



అధికారులు లేకపోవటంతో ఖాళీగా ఉన్న సచివాలయ కార్యాలయం

మధ్యాహ్నానికే సచివాలయం ఖాళీ

ప్రజాశక్తి రొద్దం

మండలకేంద్రంలోని రొద్దం -2 సచివాలయ కార్యాలయం శుక్రవారం 2 : 35 గంటలకే ఖాళీగా దర్శనిమిచ్చింది. ఈ సచివాలయం తహశీల్దార్ , ఎంపీడీవో కార్యాలయం వెనుక భాగంలోనే ఉంది. కార్యాలయంలో విలువైన వస్తువులు ఉన్నాయి. అయితే అలాగే తలుపులు తెరిచి ఉన్నాయి. సిబ్బంది ఎవరూ లేరు. ఈ నేపథ్యంలో సచివాలయంలో ఏవైనా విలువైనవి పోతే ఎవరు బాధ్యత వహిస్తారన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయం తలుపులు అలాగే తెరచి ఉండటాన్ని స్థానికులు సిబ్బందికి సమాచారమిచ్చారు. డిజిటల్ ఆసిసెంట్, వెల్ఫేర్ ఆసిసెంట్, ఎంపీడీవో కార్యాలయంలో ఉన్నారని,మహిళా పోలీస్ పక్కనే ఉన్న వెలుగు కార్యాలయం వద్ద దిశాయాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారని చెప్పారు. అయితే సచివాలయంలో ఒక్క అధికారి కూడా లేకుండా తలుపులు అలాగే తెరచి వెళ్లిపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయంలోకి అకతాయిలు ఎవరైనా వెళ్లి అందులోని విలువైన వస్తువులను ఎత్తుకెళ్లడం, హాని కలిగించడం లాంటివి చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

లేపాక్షి : అర్హత కలిగిన యువతీయువకులు ఓటుహక్కు కలిగి ఉండాలని తహశీల్దార్ బాబు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఓటు హక్కు నమోదుపై వివరించారు. జులై 27 నుండి ఆగస్ట్ 27 వరకు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రమీలమ్మ ,ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్ అశోక్, వీఆర్ఒలు, బిఎల్ఒలు తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి

పుట్టపర్తి అర్బన్ : టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేద్దామని ఆ పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 5వ జోన్ పరిధిలోని ఐదు పార్లమెంటు నియోజకవర్గాలలో ఈ బస్సు యాత్ర ప్రవేశిస్తుందన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు నల్లమాడ మండలంలోని బొగ్గలపల్లిలోకి ఈ యాత్ర ప్రవేశిస్తుందన్నారు. నల్లమాడలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధిని, అలాగే వైసిపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తామన్నారు. ఈ యాత్రలో ఐదు జిల్లాల నుంచి టిడిపి మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యమైన పార్టీ నాయకులు పాల్గొంటారన్నారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తూ నల్లమాడ నుంచి వీరాజిన్నయ్య పల్లి వరకు చేరుకుని అక్కడ భోజన విరామం ఉంటుందన్నారు. అక్కడ నుంచి పుట్టపర్తిలో టిట్కో ఇళ్లను యాత్ర బృందం పరిశీలిస్తుందన్నారు. అనంతరం బుక్కపట్నం చేరుకుని అక్కడ చెరువుపై చంద్రబాబు గతంలో ఆవిష్కరించిన పైలాను పరిశీలిస్తారన్నారు. అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకుని కొత్తచెరువుకు చేరుకుంటుందని అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని పల్లె తెలిపారు.

అమరాపురం : ఈనెల 26న మడకశిర నియోజకవర్గంలో చేపట్టే టిడిపి బస్సు యాత్రను విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ గణేష్ కోరారు. మండల కేంద్రంలోనిమాజీ జెడ్పీటీసీ నరసింహమూర్తి ఇంటి ఆవరణంలో టిడిపి నాయకులు కార్యకర్తలు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సెల్ఫీ ఛాలెంజ్, భవిష్యత్తుకు భరోసా అనే విధానంపై చేపట్టే బస్సు యాత్రలో టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీనాక్షి రామిరెడ్డి, కృష్ణమూర్తి, శివ రుద్రప్ప, దాదా పీర్‌తో పాటు అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరికి తరలిన తెలుగుతమ్ముళ్లు

తనకల్లు : మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు శుక్రవారం కదిరిలో నిర్వహించిన బస్సు యాత్రకు అధికసంఖ్యలో తరలివెళ్లారు. దాదాపు 70 వాహనాలలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్వహిస్తున్న బస్సు యాత్రను కదిరి నుండి ప్రారంభించారు. టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్ నాయుడు, బిసిసెల్ జిల్లా ఉపాధ్యక్షులు సోపాళ్యం నాగభూషణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి మల్లికార్జున, నాయకులు సరోజమ్మ, ఆనంద రెడ్డి, దేశాయ్ ప్రభాకర్ రెడ్డి తదితరులు కదిరికి వెళ్లిన వారిలో ఉన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన వైసిపి నాయకులు

నల్లచెరువు : తహసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను మండల వైసిపి నాయకులు శుక్రవారం కలిశారు. నల్లచెరువు సింగల్ విండో అధ్యక్షుడు కె .జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు తహశీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, సుధాకర్, బట్టి హైదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

కదిరి టౌన్ : నల్లచెరువు మండలం దేవిరెడ్డిపల్లికి చెందిన టిడిపి కార్యకర్త దేవిరెడ్డి బాబురెడ్డి గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నల్లచెరువు మండల కన్వీనర్ రాజశేఖర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల్ని గుర్తించండి

బత్తలపల్లి : ప్రతి ఆశా వర్కర్ తన పరిధిలో గల జనాభాలో స్పర్శలేని మచ్చలు గల అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ క్రిష్ణయ్య చెప్పారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 16వ తేదీ వరకు జరిగే లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (జాతీయ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం)లో ఆశా వర్కర్లు నిర్వహించాల్సిన సర్వేపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గంగిరెడ్డి, సిహెచ్ రాజశేఖర్, పర్యవేక్షక సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, గౌరమ్మ, నారమ్మ, ఎఎన్ఎంలు, సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

నల్ల చెరువు : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో 2022-2023 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనులపై శుక్రవారం నుండి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ మంజుల తెలిపారు. పంచాయతీల వారీగా తనిఖీ బృంద సభ్యులు గ్రామాల్లో తిరిగి పనులు తనిఖీ చేస్తారన్నారు. గ్రామసభలు కూడా నిర్వహిస్తారన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

పరిగి : మండలంలోని ఎర్రగుంట బస్టాండ్ పరిధిలో ఇటీవల నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో ఈ స్థలానికి ప్రత్యామ్నాయంగా మరో స్థలాన్ని కేటాయించాలని దళిత సంఘాల నాయకులు తహశీల్దార్ సౌజన్యలక్ష్మిని శుక్రవారం కోరారు. కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఎర్రగుంట గ్రామస్తులు శుక్రవారం స్థానిక తహశీల్దార్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తే ప్రజాప్రతినిధుల నిధులతో భవనాన్ని నిర్మించుకుంటామని చెప్పారు. ఆ ప్రదేశంలోనే అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రమణ, ఎంఆర్‌పిఎస్ రామాంజి, మాజీ ఎంపీపీ గోవిందప్ప, మద్దిలేటి, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

గాండ్లపెంట : మండల పరిధిలోని బయ్యారెడ్డి పల్లి పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు సాంబశివారెడ్డి, అశ్వర్థనారాయణ పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, రమణారెడ్డి, శ్రీనివాసులు, పుష్పలత, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలం పరిధిలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణమోహన్ బదిలీ అయిన సందర్భంగా ఆయనను శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారావు, పాఠశాల కమిటీ చైర్మన్ మంజునాథ్, స్థానికులు జీకే ప్రభాకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

శాంతినికేతన్ విద్యార్థికి ప్రథమ స్థానం

పెనుకొండ : పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి జశ్వంత్ కుమార్ రెడ్డి నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో జిల్లా స్థాయి లో జనరల్ అర్బన్ కాటగిరిలో మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జె. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి జశ్వంత్ కుమార్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లించండి

పెనుకొండ : నగర పంచాయతీలో 2023-24 మొదటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను వడ్డీ లేకుండా చెల్లించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని కమిషనర్ వంశీ కృష్ణభార్గవ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 7రోజులు మాత్రమే గడువుందని, ఈ అవకాశాన్ని పట్టణ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగర పంచాయతీ కార్యాలయం, ఫోన్‌పే యాప్, ఆన్ లైన్ వెబ్ సైట్ లో క్రెడిట్, డెబిట్ బ్యాంకింగ్ యూపీఐ ద్వారా కూడా చెల్లించవచ్చని తెలిపారు.

విలువైన వస్తువుల పట్ల జాగ్రత్త అవసరం

బత్తలపల్లి : ప్రయాణాలు చేసే సమయంలో విలువైన వస్తువులు అపహరణకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి తమ విలువైన వస్తువులను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ బత్తలపల్లి పోలీస్ సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పౌర సరఫరాల ప్రజా పంపిణీ వ్యవస్థలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్లు బాధ్యతగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన హాలులో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందుతున్న పథకాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సివిల్‌సప్లయ్ జిల్లా అధికారి వంశీకృష్ణారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఐసిడిఎస్ పీడీ లక్ష్మీ కుమారి, వ్యవసాయ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ అధికారులు సక్రమంగా పనిచేయాలని జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని అన్నారు. అక్రమ రేషన్ బియ్యం రవాణాపై ఉక్కు పాదం మోపాలని అందుకోసం విజిలెన్స్ అధికారులు పటిష్టంగా పనిచేయాలని ఆదేశించారు. ఆమడగూరు, లేపాక్షి, హిందూపురం, పరిగి, రొద్దం, మడకశిర, రామగిరి, అమలాపురం మండలాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. గత ఏడాది నుంచి జిల్లాలు 143 కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. స్టాక్ పాయింట్‌లో కంది బేడలు, పంచదార, ఆయిల్, రాగి మొదలైన వస్తువులు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన సరుకులను అందజేయాలన్నారు. జిల్లాలో రాగి సాగు విస్తీర్ణం పెంచుకోవాలని, ఈ ఖరీఫ్ లో 20వేల ఎకరాలలో సాగు చేయడానికి తగిన ప్రణాళికను చేసుకోవాలన్నారు. గర్భిణులకు బాలింతలకు చిన్నారులకు జూలై 1 నుంచి ఇంటి వద్దకే పౌష్టిక ఆహారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు, స్టాక్ పాయింట్ ఇన్‌ఛార్జులు, వ్యవసాయ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

'ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వైసిపిని వీడుతున్నాం'

ధర్మవరం టౌన్ : వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ తాము వైసీపీని వీడుతున్నామని ఆపార్టీ నాయకులు నాగశేషు, తలారిచంద్ర మోహన్‌బాబు, అంకేదుర్గేశ్, శ్రీనివాసయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామన్నారు. శనివారం స్థానిక గాంధీనగర్ మారుతీ రాఘవేంద్రస్వామి కల్యాణమండపంలో ఉదయం 10గంటలకు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి తన అనుచరులతో చేరుతున్నామని చెప్పారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి

హిందూపురం : రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రజలకు హామిలు ఇవ్వడం...వారికి టోపిలు పెట్టడం పరిపాటిగా మారిందని ఎమ్మెల్సీ, నియోజక వర్గ ఇన్‌చార్జ్ షేక్ మహమ్మద్ ఇక్బాల్ విమర్శించారు. 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే, అబ్దుల్ ఘని, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు లోకేష్, నాయకులు లతీప్ సేట్, జెడ్పీటిసి నాగభూషణం పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-హిందూపురం

సర్దు బాటు పేరుతో ప్రజల కళ్ల గప్పి పెంచుతున్న కరెంటు ఛార్జీలకు వ్యతిరేకంగా ఈ నెల 30న విద్యుత్ కార్యలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు జెడ్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ధర్నాకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యుత్ బిల్లులు చూడగానే ప్రజలు షాక్‌కు గురవుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సర్దు బాటు పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నాయన్నారు. దీనికి నిరసనగ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ఆందోళనకు ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహప్ప, రమణ, రాము, చంద్ర, కల్లూరు ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామాంజినప్ప, బాబయ్య, చంద్ర, హాస్పిటల్ సెంట్రేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు అమర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

చేపల చెరువు పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చిలమత్తూరు

స్థానిక తుమ్మలకుంట చెరువును అధికారులు సందర్శించారు. తుమ్మల కుంటలో చేపలు మృతి అనే శీర్షిక ఈ నెల 22న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మత్స్యశాఖ అధికారి శంకర్, కార్యదర్శి నాగరాజు, ఇంజనీర్ గోవర్ధన్ చేపల చెరువును పరిశీలించారు. చెరువులో చేపలు మృతిచెందడానికి కారణాలను తెలుసుకున్నారు. నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గడంతోనే చేపలు మృతిచెందాయని తేల్చారు. కేవలం జిలేబీ జాతికి చెందిన చేపలే మృతి చెందాయని ఇందుకు కారణం ఆ చేపలకు తగిన ఆక్సిజన్ అందకపోవడమే కారణమని అన్నారు. పసుపు, ఉప్పు, సున్నంను నీటిలో చల్లి నీటిని కదిలిస్తే వాటికి ఆక్సిజన్ అందుతుందని అన్నారు. నీటిని నమూనాని పరీక్షల నిమిత్తం హిందూపురం ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయానికి పంపించారు.

బడుగు బలహీన వర్గాలు ఒక్కతాటిపై నిలుద్దాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆంధ్రప్రదేశ్‌లోని బడుగు బలహీన వర్గాలు ఒక్కతాటిపై నిలుద్దామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తల వెంకటరమణ పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో విశాఖ వేదికగా బీసీ కుల సంఘాల ఐక్యత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దాదాపు 54 పైగా కుల సంఘాలు నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బత్తల వెంకటరమణను కుల సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బత్తల వెంకటరమణ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల అభివృద్ధికి పాటుపడుతున్న జగన్మోహన్‌రెడ్డికి అండగా ఉందామన్నారు. బీసీలకు రాజ్యాధికారంలో సర్పంచి స్థాయి నుంచి మంత్రి పదవి వరకు వాటా కల్పించిన ఘనత జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందని అన్నారు. బీసీలంతా ఏకతాటిపై నిలబడి ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్రమంతా పర్యటించి నవరత్నాలు ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కియా ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు జీవనోపాధి



కియా ప్రతినిధులతో మహిళలు


ప్రజాశక్తి -పెనుకొండ

కియా ఇండియా గ్రామీణ మహిళలకు నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి పెంపుదలతో సాధికారత కల్పిస్తుందని కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మవారి పల్లి లోని కియా ఇండియా ప్లాంట్ ప్రాంగణానికి సమీపంలో సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా టింబక్ట్ కలెక్టీవ్ సంస్థ సహకారంతో గ్రామీణ మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ, టింబక్టు కలెక్టివ్ ప్రతినిధులు బబ్లూ గంగూలీ, కో-ఫౌండర్ మేరీ వట్టమట్టం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కబ్డాంగ్ లీ మాట్లాడుతూ కియా ఇండియా గ్రామీణ మహిళలకు స్థిరమైన జీవనోపాధిని నిర్మించి, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని భావిస్తోందన్నారు. 75 మంది మహిళలు 36 వారాలు శిక్షణ పొందుతారని వారి 90 రోజుల శిక్షణలో రోజుకు 350 రూపాయల స్టైఫండ్ అందిస్తామని చెప్పారు. ఏడాది పొడవునా అభ్యర్థులకు శిక్షణ సహాయంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలతో శిక్షణా కేంద్రం ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో శిక్షణ పొందిన వారు తమ స్వంత సంస్థలను స్థాపించడానికి, ఆర్థికవృద్ధికి దోహదపడేలా మెంటార్‌షిప్ పొందగలరని ఆశిస్తున్నామన్నారు. స్థానిక విద్యార్థుల కోసం ఆటో సర్వీస్ టెక్నీషియన్ ప్రోగ్రాం పెనుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ బ్లాక్ బిల్డింగ్, ఐటిఐ కళాశాల ఆధునిక ల్యాబ్‌ల సహకారం, అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ క్యాథ్ ల్యాబ్‌కు వినియోగ వస్తువుల విరాళం వంటి ఇతర సి ఎస్ ఆర్ కార్యక్రమాలలో భాగంగా కియా ఇండియా సుబ్బరాయుని పల్లిలో ప్లాంటేషన్ అనేక కార్యక్రమాలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కియా ఇండియా పిఆర్ఓ తేజస్వి బండారి, కియా ఇండియా సిఎస్ఆర్ ప్రతినిధులు, టింబక్ట్ కలెక్టీవ్ సంస్థ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోండి

ప్రజాశక్తి - సోమందేపల్లి

అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వేరుశనగ నాణ్యంగా ఇవ్వాలని, ప్రభుత్వం పట్టు రైతులుకు అందిస్తున్న ఇన్సెంటివ్ ను అందజేయాలని ఎపి రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎఒ కవితారాణికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పరిస్థితి దుర్భరగా తయారైందన్నారు. ప్రభుత్వం రైతులకు రసాయనక ఎరువులను సబ్సిడీతో అందజేయాలన్నారు. రైతు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. రైతులకు అన్ని రకాల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హరి, జంగాలపల్లి పెద్దన్న, భాస్కర్, హనుమంత్ రెడ్డి, సత్యనారాయణ, రాజగోపాల్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి కుర్చీలను అందిస్తున్న దాత, తదితరులు

పాఠశాలకు కుర్చీలు వితరణ

ప్రజాశక్తి- పరిగి

పరిగి మండలంలోని ఊటకూరు గ్రామానికి చెందిన నరేంద్రరెడ్డి తాను చదువుకున్న పాఠశాలకు తన వంతుగా 20 కుర్చీలను అందించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ప్రతి పుట్టినరోజు తన గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించే తన ఉదారతను చాటుకునే ఈయన పాఠశాలకు అవసరమైన కుర్చీలు అందించడం పట్ల ఎంఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం నరేంద్రరెడ్డిని అభినందించారు ఈ చర్యలను ఆదర్శంగా తీసుకోవాలని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మనోజ్ ఆరాధ్య చోరారు. దాదాపు రూ. 15వేల విలువజేస్తే కుర్చీలను పాఠశాలకు ఇవ్వడం తనని ఎంతో సంతృప్తిని ఇచ్చిందని నరేందర్ రెడ్డి అన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి


చెన్నేకొత్తపల్లి : చెన్నేకొత్తపల్లి జాతీయరహదారి మీద 44 అంబేద్కర్ విగ్రహం దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. తాడిపత్రికి చెందిన సారాయి ఆంజనేయులు (33) రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు గాయపడ్డాడు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

హిందూపురం : పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో లభ్యమైన మృతదేహానికి సంబందించి హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఇన్‌ఛార్జి సిఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు... మృతుడు దాదాపీర్ అలియాస్ దాదు (21) నిందితులు హస్నాబాదుకు చెందిన సుభాహాన్, ఆసీఫ్‌వుల్లా, తౌహిద్‌లు స్నేహితులు. అందరు కలిసి తరచుగా పార్టీలు పెట్టుకునే వారు. ఈ క్రమంలో మే 21న ఎప్పటి లాగే పార్టీ చేసుకుని ఎవరు ఇంటికి వారు వెళ్లు హస్నాబాదులో పరిగి రోడ్డు ఉస్మాన్ ఎయిర్ కూలర్ సోఫాల షాపు వద్ద అందరు దిగారు. ఈ సందర్భంగా దాదాపీర్, సుభాన్‌తో అనవసరంగా గొడవ పడి వారి తల్లి గురించి దుర్భాషలాడాడు. దీంతో సుభాన్ ఆగ్రహంతో అక్కడే ఉన్న ఇటుకతో దాదాపీర్ తల మీద కొట్టి, కాలితో తన్నాడు. దీంతో కిందపడిన దాదాపీర్ మృతిచెందాడు. అయితే తౌహిద్, సుభాన్ స్కూటీలో తౌహిద్ ఇంటి దగ్గరకు తీసుకొనిపోయి వరండాలో పడుకోబెట్టారు. మరుసటి రోజు తౌహిద్ ఆటోలో ఆటోనగర్ వద్ద బయలుప్రదేశంలో దాదాపీర్ మృతదేహాన్ని పడేసి వెళ్లాడు. ఈ కేసులో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుల్లో ఇద్దరిని గురువారం భగిరథ సర్కిల్‌లో అదపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్నా తౌహిద్ గురించి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేనేత కార్మికుడు ఆత్మహత్య

సోమందేపల్లి : ఓ చేనేత కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నాడు చోటు చేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... సోమందేపల్లి మండల కేంద్రం దుర్గానగర్‌లో నివాసం ఉంటున్న నాగరాజు నాయక్ కుమారుడు నితిన్ నాయక్(19) చేనేత మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల నేత మగ్గాన్ని వదిలేసి పవర్‌లూమ్స్ మగ్గం కూలీగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇతను తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మురళి తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

జగనన్న ఇంటి నిర్మాణం ధ్వంసం

చిలమత్తూరు : మండలంలోని టేకులోడు గ్రామానికి చెందిన లబ్ధిదారులు నిర్మిస్తున్న జగనన్న ఇంటి నిర్మాణాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన సువర్ణమ్మకు ప్రభుత్వం టేకులోడు లేఅవుట్‌లో ఇంటిని మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం గోడలు వరకు చేపట్టారు. నిర్మాణ దశలో ఉన్న ఇంటి ముందు వైపు గోడను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. గోడతో పాటు నీటి నిల్వ కోసం నిర్మించుకున్న సంపు మెట్లను ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం దీనిని గమనించిన సువర్ణమ్మ చిలమత్తూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.

ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు

బత్తలపల్లి : ఆకారణంగా గొడవలకు దిగడం, ఘర్షణలకు పాల్పడడం లాంటివి చేస్తేకఠిన చర్యలు తప్పవని ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో ఆయన ఎస్ఐ టీవీ శ్రీహర్షతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో వివరాలను సేకరించారు. రెండు విడతలుగా ఎందుకు ఘర్షణలకు దిగాల్సి వచ్చింది. గొడవలు ఎందుకు జరిగాయంటూ ఆరా తీశారు. గొడవలు జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎస్ఐతో మాట్లాడుతూ మరోసారి ఘర్షణలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఘర్షణలకు దిగి అనవసరమైన కష్టాలను కొనితెచ్చుకోవద్దని ప్రజలకు సూచించారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో శనివారం ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నీటి సరఫరా బంద్ చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్మవరం ఫిల్ట్రేషన్ ప్లాంట్ వాటర్ వర్క్స్ లో ఉన్న క్లారిఫ్లోక్యులేటర్ ని శుభ్రం చేయనున్నామని తెలిపారు. శనివారం రావాల్సిన తాగునీటి సరఫరా ఒకరోజు ఆలస్యంగా ఆదివారం చేస్తామని తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

చిలమత్తూరు : ప్రయివేటు పాఠశాలల బస్సులలో స్థాయికి మించి విద్యార్థులను తీసుకెళితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ప్రయివేటు పాఠశాలలకు విద్యార్థులను తరలించే బస్సు డ్రైవర్లతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబదనలు తప్పని సరిగా పాటించాలన్నారు. బస్సులలో కేటాయించిన సీట్లకు అనుగునంగా విద్యార్థులను తరలించాలని సూచించారు. మోటర్ వెహికల్ చట్టం ప్రకారం నిబందనలు పాటించాలని లేకపోతేకఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

22న ప్రత్యేక లోక్ అదాలత్

హిందూపురం : జూలై 22న స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక అదాలత్ నిర్వహిస్తున్నట్లు అదనపు జిల్లా జడ్జి శైలజ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రమాద కేసులు, తదితర ఉన్నత న్యాయస్థానం సూచించిన కేసులకు సంబంధించి సత్వర పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


26న సప్తగిరి కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు : పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో ఉన్నా సప్తగిరి కళాశాలలో ఈ నెల 26న న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు అదనపు జిల్లా జడ్జి శైలజ తెలిపారు. ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ సదస్సులో అక్రమ మాదకద్రవ్యాల నివారణ, అక్రమ రవాణా అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

సబ్సిడీ వేరుశనగ పంపిణీ

ఓబుల దేవర చెరువు : పట్టాదారు పాసుపుస్తకాలు లేని శోత్రీయం భూములు కలిగిన రైతులకు మండల పరిధిలోని తంగేడు కుంట రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ వేరుశనగను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ విత్తన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు అవుటాల రమణారెడ్డి జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు రాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ సలహాదారు

కదిరి టౌన్ : పట్టణంలోని శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దేవాదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జెరిపిటి గోపాల క్రిష్ణ , ఆలయ ముఖ్య అర్చకులు అంజన్ కుమార్ చార్యులతో పాటు దేవస్థానం సిబ్బంది జ్వాలాపురం శ్రీకాంత్‌కు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు జరిపించి సన్మానించారు.



జ్వాలాపురం శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న దృశ్యం